క్లుప్తంగా

రేపు చౌడేశ్వరి జయంతి ఉత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆచార్లకాలనీలోని చక్ర చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం, సాయంత్రం 3.30 గంటలకు భాష్యం పాఠశాలలో తొగట వీర క్షత్రియ కుల గురువు శ్రీ దివ్యజ్ఞానానంద గిరి స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని కార్యనిర్వాహకుడు పల్లా శేషయ్య తెలిపారు. అనంతరం ప్రసాద వినియోగం, అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న త్రీ టౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సీఐ వెంకటరమణ, త్రీటౌన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి రాజీవ్‌సర్కిల్, శ్రీరాముల పేట, టీబీరోడ్డు, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్, మార్కెట్ యార్డు, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.

కేసీ కెనాల్‌కు నీళ్లు వదిలిన ఎమ్మెల్యే



రాజోలి ఆనకట్ట వద్ద కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

దువ్వూరు : రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కెనాల్‌కు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సాగునీటిని విడుదల చేశారు. ఆయన పూజలు చేసి కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. రాజోలి ఆనకట్ట కింద జిల్లాలో 92వేల ఎకరాలు ఆయకట్టు విస్తీర్ణం ఉందని తెలిపారు. రాజోలి ఆనకట్ట నిర్మాణం పూర్తయితే కేసీ కెనాల్ కింద ఉన్న ఆయకట్టుకు రెండు పంటలకు నీరు అందుతుందని తెలిపారు. ఈ ఐదేళ్లలో రాజోలి జలాశయాన్ని పూర్తి చేసి రైతుల ఆశలను నిజం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్ఆర్ఐటీ) ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. శుక్రవారం కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన డిప్లమా, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు నాగప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిక ప్రకారం లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ సాధించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఉద్యమించి స్టీల్ ప్లాంట్ సాధించుకుందామని స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్ పిలుపునిచ్చారు. స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపీజే కార్యాలయంలో శుక్రవారం కడప కల్పవృక్షం స్టీల్ ప్లాంట్ సాధించుకుందామా? వదులుకుందామా? అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు ఈ కరపత్రాన్ని అందించి అందరిని కలుపుకొని ముందుకు పోతామన్నారు. స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కో కన్వీనర్ సలీం మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరంకు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు మన ప్రజా సేవా సమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఎస్ఐఓ నాయకుడు అదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంట.. సిరులు ఇంట

- విస్తారంగా ఉద్యాన పంటల సాగు
- లభిస్తున్న గిట్టుబాటు ధరలు
- మండలంలో 2,732 ఎకరాల్లో అరటి సాగు



సాగులో ఉన్న అరటి పంట

కాశినాయన : అన్నదాతలకు ఉద్యాన పంటలు సిరులు కురిపిస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులు వెనకడుగు వేసేవారు. 15 ఏళ్లుగా మండలంలో ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొదట 50 ఎకరాల్లో సాగైన అరటిపంట ఇప్పుడు 2,732 ఎకరాల్లో రైతులు సాగు మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉండటంతో సాగు విస్తీర్ణంపై రైతుల ఆసక్తి పెరిగింది. ఈ ఏడాది అరటి పంటకు రైతులు ఆశించిన స్థాయిలో ధర లభించింది. మండలంలో ఎక్కువగా ఉద్యాన పంటలను వరికుంట్ల, నాయునిపల్లె, ఆకులనారాయణపల్లె, సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, పగడాలపల్లె, పాలగిరి, కోడిగుడ్లపాడు, కె.ఎస్.కొట్టాల, కొండ్రాజుపల్లె గ్రామాల్లో సాగు చేస్తారు. ఉద్యాన పంటలను ఒకసారి సాగు చేస్తే పంట రకాలను బట్టి మూడు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు పంట వస్తుందని రైతులు అంటున్నారు.

ఎకరాకు సాగు ఖర్చు

ఎకరా అరటి పంటను సాగు చేయాలంటే రూ.16 వేలు మొక్కలకు, సేద్యాలకు రూ.15 వేలు, రసాయనిక ఎరువులు, డ్రిప్ మందులకు రూ.45 వేలు, పురుగు మందులకు రూ.5 వేలు, కూలీ ఖర్చులకు రూ.10 వేలు కలిపి దాదాపు రూ.లక్ష ఖర్చు వస్తుంది. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12 టన్నుల నుంచి 16 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధర ఆశాజనకంగా ఉంటే రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వివిధ రకాల ఉద్యాన పంటలు

మండలంలో ఆయిల్‌ఫామ్ 354 ఎకరాలు, మామిడి 311 ఎకరాలు, నిమ్మ 297 ఎకరాలు, జామ 285 ఎకరాలు, కొబ్బరి 275 ఎకరాలు, తమలపాకు 120 ఎకరాలు, రోజా తోటలు 112 ఎకరాలు, దానిమ్మ 104 ఎకరాలు, రేగు 61 ఎకరాలు, సీతాఫలం 52 ఎకరాలు, అంజూర 48 ఎకరాలు, నన్నారి 39 ఎకరాలు, సపోట 15 ఎకరాలు, డ్రాగన్‌ఫ్రూట్ 13 ఎకరాలు, నేరేడు 11 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

మండలంలో దాదాపు 4,800 ఎకరాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటల రైతులు మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వ్యాపారులు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మి లాభాలు ఆర్జిస్తున్నారు. ఢిల్లీ వ్యాపారులు వస్తేనే ఎక్కువ రేటు పెడతారు. వారు రాకుంటే స్థానిక వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తారు. దీంతో రైతులు పచ్చిసరుకు కాబట్టి వారు అడిగిన కాడికి ఇచ్చి నష్టపోతున్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎన్నో ఒడిదుడుకులు, అవస్థలు పడి పండిస్తున్న అరటి, ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. సాధారణంగా తోటలు కాపుకు వచ్చిన సమయంలో అరటి పంటకు గిట్టుబాటు ధర తక్కువగా ఉంటుంది. దీంతో రైతులు పచ్చిసరుకు కాబట్టి వ్యాపారులు అడిగిన కాడికే ఇవ్వాల్సి వస్తుంది. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

\- శేషారెడ్డి, రైతు, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

సూచనలు పాటించాలి



ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలి. ఏ సమయంలో ఏ మోతాదులో మందులు వాడాలో అవగాహన కలిగి ఉండాలి. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు పంటలకు తెగుళ్లు సోకినప్పుడు మమ్మల్ని సంప్రదించాలి. కొంత మంది రైతులు పురుగు మందుల షాపుల వద్దకు వెళ్లి వారు ఇచ్చిన మందులను పిచికారీ చేసి నష్టపోతున్నారు. మా సూచనలు, సలహాలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు.

\- శ్రీనివాసరెడ్డి, ఉద్యాన అధికారి, కాశినాయన మండలం

వాడి వేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. శుక్రవారం వైస్ ఎంపీపీ సీఎం బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ కూడా అధికారుల వైఖరిని నిలదీశారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు.

చేయని పనికి బిల్లు ఎలా ఇస్తారు?

అక్కలరెడ్డిపల్లె ఎంపీటీసీ రవి సమావేశంలో హౌసింగ్ ఏఈ రమేష్‌ను కృపానగర్‌లో ఇంటి బేసుమట్టం కూడా వేయకుండా ఎలా బిల్లు ఇచ్చారని నిలదీశారు. బేసుమట్టం ఫోటో ఉండాలని, ఏఈ పరిశీలించాలని అప్పుడే బిల్లు మంజూరు చేయాలని, ఏదీ లేకుండానే బిల్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. స్పందించిన ఏఈ బిల్లు ఎలా మంజూరయిందో పరిశీలిస్తామని తెలిపారు. కవలకుంట్ల పంచాయతీలో 50 ఎకరాల్లో మల్లమ్మకుంట ఉందని, అందులో ముగ్గురు వ్యక్తులు 15 ఎకరాలు ఆక్రమించుకున్నారని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ కుంటను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తే ఎందుకు చర్య తీసుకోలేదని డిప్యూటీ తహశీల్దారు సంజీవరెడ్డిని జెడ్పీటీసీ ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ సుధ స్పందిస్తూ నేరస్తులపై చర్య తీసుకోవాలని, నోటీసులతో కాలక్షేపం చేయడం సరికాదన్నారు. వడ్డెపాలెంలో స్మశానభూమిని ఆక్రమించుకుంటున్నారని, శవాలు కూడా తొలగించి పొలం సాగు చేస్తున్నారని, అధికారులకు చెప్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్ ప్రశ్నించారు. పట్టణంలో రోడ్డును అసంపూర్తిగా నిలిపి వేశారని, కొద్దిపాటి వర్షానికే అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, సాయిబాబా ఆలయం వద్ద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఆర్అండ్‌బీ ఏఈ పట్టించుకోవడం లేదని నిలదీశారు. మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద రావు, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి లోపల అన్ని గదులు పరిశీలించారు. రికార్డ్స్ పరిశీలించారు. 3 నెలలుగా గైనకాలజిస్ట్ ఆసుపత్రికి రావడం లేదని, ప్రసవాలకు వచ్చిన గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆమె వైద్యులను విచారించారు. బొప్పాపురంలో ఓ మహిళ ప్రసవం జరగక మృతి చెందిన ఘటనపై ప్రశ్నించారు. పాతిక కోట్ల రూపాయలతో అత్యంత ఆధునిక సదుపాయాలతో భవనాలు నిర్మించి, వైద్యులను నియమించినా రోగులకు ఎందుకు సేవలందటం లేదని ప్రశించారు. అవసర సమయాల్లో తక్షణ సేవలు అందించి, రోగులను కాపాడాలని ఆమె సూచించారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, టేకూరుపేట, రంగసముద్రం సర్పంచులు రమణారెడ్డి ఉన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే భేటీ

రంగసముద్రం పంచాయతీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ శుక్రవారం భేటీ అయ్యారు. తన గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేను రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి శాలువ, పూలదండతో సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలి



మాట్లాడుతున్న సుధాకర్ మాదిగ

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ కోరారు. ఎస్సీ వర్గీకరణకు అనకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుతో 30 ఏళ్లుగా మాదిగలు చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు మారితే ఎస్సీ వర్గీకరణ అంశానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, ఈ కారణంగా పార్లమెంట్‌లో చట్టం చేస్తే శాశ్వతంగా సమస్య పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, సభ్యులు మద్దిలేటమ్మ, దాసు, రాజేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ విజయం ఉద్యమంలో అమరులైన దళిత వీరులకు అంకితమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మాదిగ అమరులకు అంకితం

మైదుకూరు : 30 ఏళ్లుగా మాదిగలు చేసిన పోరాటం ఫలితంగా సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వర్గీకరణకు కోసం అమరులైన మాదిగ జాతి బిడ్డలకు అంకితం చేస్తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు మిద్దె వెంకటరమణ మాదిగ తెలిపారు. శుక్రవారం మైదుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించి సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, సంజీవ, నల్లల ఓబులేసు, ముల్లపాక నారాయణ, గోపి, నాగేశ్వరరావు, రవి, గురుమూర్తి, బ్రహ్మయ్య, మునేసు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉమ్మడి కడప జిల్లా బాల్‌బాడ్మింటన్ జట్టు ఎంపికలు వైఎస్సార్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం దువ్వూరులోని క్రిస్టియన్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, వెంకట రమణ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 2, జూనియర్ విభాగంలో పాల్గొనే 2005 జనవరి 2 తరువాత పుట్టిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9490181104, 7036907303ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు

మైదుకూరు : మైదుకూరు మండలం విశ్వనాథపురంలో ప్రకృతి వ్యవసాయం విభాగం అధికారుల ప్రోత్సాహంతో పలువురు మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది బండి తిరుమలయ్య, ఆదినారాయణ, వెంకటరమణ, నాగజ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కిచెన్ గార్డెన్‌లో కూరగాయలు సాగు చేయడం వలన భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. క్రిమి సంహారక రసాయనాలతో పండించిన కూరగాయల కంటే ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు పిల్లలకు, పెద్దలకు ఆరోగ్యానికి ఎంతో మంచిదని తెలిపారు. కిచెన్ గార్డెన్ సాగు వలన ఒక కుటుంబానికి సరిపడా కూరగాయలు ఎటువంటి ఖర్చులు లేకుండా పండించుకోవచ్చని పేర్కొన్నారు.

వైయస్ జగన్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైయస్ జగన్ పాలనలో విద్యారంగానికి పెద్ద పీట వేశామని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి పథకం ద్వారా 84 లక్షల మంది విద్యార్థులకు సుమారు రూ. 19 వేల కోట్లు కేటాయించి వారి విద్య సజావుగా సాగేలా జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. 2023లో 10 వేల డిజిటల్ క్లాస్ రూమ్స్ ప్రారంభించి దేశంలో తొలి రాష్ట్రంగా ఏపీ నిలచిందన్నారు. కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు ఎదగాలని జగనన్న లక్ష్యంగా పెట్టుకుని పని చేశారని కొనియాడారు.

శాకంబరిదేవిగా చాముండేశ్వరి



రాజుపాళెం : వెల్లాలలో శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన పార్వతీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ఆషాడ మాస చివరి శుక్రవారం సందర్భంగా చాముండేశ్వరి అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేసి వడిబియ్యం కట్టారు. అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అరటిపళ్లు, డ్రాగన్‌ఫ్రూట్, ఆపిల్, చీనీ, టమాటా, నిమ్మకాయలు, బీరకాయ, క్యారెట్, వంకాయ, ఆకుకూరలతో శాకంబరిదేవిగా అలంకరించారు. సాయంత్రం 100 మందిపైగా మహిళలు అమ్మవారికి చీర, సారె తీసుకుని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భీమలింగేశ్వర స్వామి ఆలయంలో..

రాజుపాళెం : ఆషాడమాసం సందర్భంగా మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, నిమ్మకాయలతో శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వెంకటాచలపతి భీమలింగేశ్వర స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



తహసీల్దార్ మధురవాణి సరస్వతికి పూలకుండి అందజేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల తహసీల్దార్‌గా వి.గంగయ్య శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చిన విద్యాసాగర్ బదిలీ అయ్యారు. కొత్తగా గంగయ్య తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకిరంచారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయ పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ గంగయ్యకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఖాజీపేట : ఖాజీపేట నూతన తాహసీల్దార్‌గా సరస్వతి బాధ్యతలు తీసుకున్నారు. ఖాజీపేట తాహసీల్దార్ బదిలీపై కావడంతో నూతన తాహసీల్దార్‌గా సరస్వతిని నియమించారు. ఈ మేరకు ఆమె విదుల్లో చేరారు.

దువ్వూరు : దువ్వూరు మండల నూతన తహసీల్దార్‌గా జీవీ మధురవాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మధురవాణికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, ఆర్ఐ జాన్సన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్ పద్మావతి, వీఆర్ఓలు, పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్ర పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమం, మృత్యుంజయ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని కాలక్షేప మండప వేదికపై ఆశీనులను చేశారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకరబాలాజి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు సేవలు అందించడమే కేవీకేల లక్ష్యం

మైదుకూరు : రైతులకు సేవలు అందించడమే కేవీకేల లక్ష్యమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం డాక్టర్ కరుణశ్రీ అధ్యక్షతన కేవీకే స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చే విప్లవాత్మకమైన మార్పులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రైతులకు అందించే లక్ష్యంతో కేవీకేలు ఏర్పడ్డాయని అన్నారు. పాండిచ్చేరిలో 1974 మార్చి 21వ తేదీన తొలి కేవీకేను స్థాపించారన్నారు. వ్యవసాయ సంబంధిత విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చి రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం కేవీకే పశువైద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ హరిణి టార్చ్ ర్యాలీని ప్రారంభించిన వనిపెంట కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణకు అందించారు. ఆయన కార్యక్రమానికి హాజరైన రైతులకు టార్చ్‌ను అందజేశారు.

మిరపలో అధిక దిగుబడులు

సమగ్ర యాజమాన్యంతో మిరప సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని గుంటూరు లామ్ ఉద్యాన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.నాగలక్ష్మి, డాక్టర్ ఎ.రజిని అన్నారు. వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మిరప సాగుపై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ రజిని, డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ, బీపీ ప్రతాప్‌రెడ్డి మిరప సాగుపై ప్రచురించిన బుక్‌లెట్లను ఆవిష్కరించారు.

అమ్మపాలు అమృతంతో సమానం



ప్రొద్దుటూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ అరుణకుమారి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది



ఖాజీపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణ కుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రాజెక్టు పరిధిలోని లింగారెడ్డి కొట్టాలు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, రమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం

రాజుపాళెం : తల్లి పాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని కూలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పిల్లలకు పాలు పట్టించేటప్పుడు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణంలో కార్యకర్త శ్రీకళ పండించిన ఆకుకూరలు, కూరగాయలను గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, సచివాలయ ఏఎన్ఎం సుభద్ర, భారతి, కార్యకర్తలు శ్రీకళ, మంజుల, స్వర్ణ, సరస్వతి, రేష్మ, జయమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కలసపాడు : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారి డాక్టర్ సాయితేజ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులకు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు తల్లిపాలలో పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిప్రియ, సీహెచ్ఓ దుర్గ, ఏపీఎం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కాశినాయన : అమ్మపాలు అమృతంతో సమానమని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జయరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ పేర్కొన్నారు. శుక్రవారం నరసాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, వైద్యాధికారుల ఆధ్వర్యంలో తల్లిపాల దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో..

ఖాజీపేట: తల్లిపాలను బిడ్డలకు తాపడం వలన వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ ముబిన్ అన్నారు. తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజున కూనవారిపల్లె, ఖాజీపేట -1 సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు తాపించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, కమ్యూనిటీ హెల్త్ అధికారి స్వర్ణలతతోపాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు : తల్లిపాలు బిడ్డకు అమృతం అని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, హేమలత, రోషిణి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తప్పకుండా తాపించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతం

బద్వేలు అర్బన్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలం పరిధిలోని తొట్టిగారిపల్లె గ్రామంలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలో అందించే ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివని అన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, సీహెచ్ఓ చంద్రావతి, సూపర్‌వైజర్ వెంకటమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.